నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్

బుధవారం 6 డిసెంబర్ 2023 | WEDNESDAY, DECEMBER 6, 2023 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD | పేజీలు PAGES : 8



బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# కేసీఆర్‌ను కలిసిన కోవ లక్ష్మి

**తాజాగా జరిగిన అసెంబ్లీ** ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మికి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని.. కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు.

**- ఆసిఫాబాద్, డిసెంబర్ 5**

# ముమ్మరంగా వరి కొనుగోళ్లు

## నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 199 కొనుగోలు సెంటర్ల ఏర్పాటు

- వానకాలం సీజన్ కొనుగోలు లక్ష్యం 1,37,000 మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు విక్రయించిన 12,700 మంది రైతులు
- 63,096 మెట్రిక్ టన్నులు సేకరణ
- 6 వేల మంది ఖాతాల్లో రూ.62 కోట్ల చెల్లింపులు
- ఈ ఏడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.143 పెంపు
- 'గ్రేడ్-ఏ'కు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183

.. మధ్యపేజీలో



బైంసా మండలంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

**నిర్మల్ జిల్లాలో వరి** పంట కొనుగోళ్లు ఊపందుకున్నాయి. వానకాలం సీజన్‌కు సంబంధించి 1,37,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం 199 కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు 12700 మంది నుంచి ధాన్యం సేకరించగా, 63096 మెట్రిక్ టన్నులు కేంద్రాలకు చేరుకుంది. ఇందులో 6 వేల మంది ఖాతాల్లో రూ. 62 కోట్లు చెల్లింపులు చేసింది. ఈ ఏడాది మద్దతు ధర క్వింటాలుకు రూ. 143 పెంచడంతో పాటు రైతాంగానికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసింది. గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుంది.

**-నిర్మల్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ)**



# మంచిర్యాలే కీలకం

**ఈ నెల 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ**

- 8వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ.. ఆ తర్వాతే పొత్తులపై స్పష్టత..
- మంచిర్యాల జిల్లాలోని మూడు ఏరియాల్లోనే అత్యధిక ఓట్లు
- ఇక్కడ ఎవరికి లీడ్ వస్తే వారే గెలిచే అవకాశం
- అప్రమత్తమైన కార్మిక సంఘాలు..
- ముమ్మర ప్రచారం దిశగా అడుగులు..

.. మధ్యపేజీలో

**సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం** ఎన్నికల ప్రక్రియ తిరిగి పునఃప్రారంభమైంది. సెప్టెంబర్ 27వ తేదీన నోటిఫికేషన్ వెలువడింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడగా.. ఎన్నికలు ముగియడంతో తిరిగి ప్రక్రియ ప్రారంభమైంది. అక్టోబర్ 6,7 తేదీల్లో నామినేషన్లు తీసుకోని 10వ తేదీన పరిశీలన పూర్తి చేసిన అధికారులు 13 కార్మిక సంఘాలు బరిలో ఉన్నట్లు ప్రకటించారు. ఈనెల 8వ తేదీన ఉపసంహరణ ప్రక్రియ ముగియనుండగా.. బరిలో ఉండే సంఘాలపై స్పష్టత రానుంది. హై కోర్టు కూడా ఈనెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచించింది. ఈ మేరకు నామినేషన్లు వేసిన 13 కార్మిక సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు ఎన్నికల ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. సింగరేణి వ్యాప్తంగా 39,832 మంది కార్మికుల ఓట్లు ఉండగా.. ఇందులో 14,985 మంది మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల్లోనే ఉండడం విశేషం. ఇక్కడ ఎవరికీ లీడ్ వస్తే వాళ్లే గుర్తింపు సంఘంగా గెలిచే అవకాశాలు ఉన్నాయి. కాగా.. అప్రమత్తమైన కార్మిక సంఘాలు ఎన్నికల ప్రచార ప్రక్రియను మొదలు పెట్టనున్నాయి.

**- మంచిర్యాల, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**



ఆదిలాబాద్ ఏరోడ్రంలో ఉదయం సమయంలో మంచు



# వణికిస్తున్న 'మిగ్‌జాం'

**మిగ్‌జాం తుఫాన్ ప్రభావం** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై పడింది. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోగా.. మంచుతోపాటు చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు వణుకుతున్నారు. 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా.. తుఫాన్ వల్ల చలితీవ్రత అధికంగా ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారులపై వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్తున్నారు. వృద్ధులు, చిన్నారులు అతి జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చలిగాలులు, ఇగం నుంచి ఉపశమనం పొందడానికి స్వెట్టర్లు, మంకీక్యాప్‌లు ధరించాలని. అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని తెలుపుతున్నారు.

**- ఆదిలాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ)**